# రచయితలారా! చప్పట్లు కొట్టండి!



సి.హెచ్. మధు

నేను కథ చదువుతాను వింటారా? అన్నాడు తన యింటిలో కూర్చున్న ముగ్గురు రచయితలైన మిత్రులతో గోపి.

"ఓ చదవండి!" అన్నాడు కృష్ణమూర్తి. కావ్యశ్రీ అనే పేరుతో కవితలు రాస్తుంటాడు.

"కథ వినటానికే కదా మీ యింటి కొచ్చింది?" అన్నాడు సమీక్షలు రాసే సవ్యసాచి

"సామాజిక ప్రయోజనంగల కథలు రాసే కథకునివి నీవు" పొగిడాడు నాటకాలు రాసి వేయించటానికి ఎత్తులు వేసే శర్మ.

పైన ఫంకా తిరుగుతూ వుంది. టేబుల్ పైన రెండు రకాల సిగిరెటు డబ్బాలు, ఒక రకం అగ్గిపెట్టె, ఒక యాష్‌ట్రే, టేబుల్ క్రింద- ఖాళీ కాఫీ కప్పులున్నాయి. మేడ పైన ముగ్గురూ కూర్చున్నారు సాయంకాలం టైము ఎదురుగా కిటికీ, కిటికీ నుండి చూస్తే అస్తమిస్తున్న అందమైన సూర్యుడు. కిటికీ నుండి క్రిందికి చూస్తే రోడ్డు. రోడ్డు పైన జనం.

సిగిరెట్టు పొగ పంకా గాలికి చెల్లా చెదరవుతూ వుంది.

పుస్తకం తీసుకొచ్చాడు గోపి.

"ఎప్పుడు రాసావు?" సవ్యసాచి ప్రశ్న.

"నిన్న రాత్రి."

"కథ పేరేమిటి?"

"ముళ్ళ కాళ్ళ క్రింద, గులాబీలు తలపైన"

"పేరు బాగుంది."

"పేరు పెట్టటంలో నీకు నీవే సాటి"

"కథ చదవండి!"

కథ చదివాడు

రచయితలంతా చప్పట్లు కొట్టారు.

హాలు చప్పట్లతో మ్రోగి పోయింది.

"బాగుందోయ్ నీ కథ. స్త్రీకి సామాజిక భద్రత వుండాలని బాగా రాసావు" సవ్యసాచి కామెంటు.

"బాగా రాసావు కథను. కథను మలచటంలో గొప్ప తనముంది. వస్తువు కూడా బాగుంది. స్త్రీకి సామాజిక భద్రత లేకపోతే సమాజానికి నష్టమని చక్కగా వివరించావు" శర్మ మెచ్చుకోలు.

"స్త్రీలను అవమానపరిచే వారిని చాచి చెంపకాయ కొట్టాలని కథలో ఇన్‌డైరక్టుగా గొప్పగా చెప్పావు" కావ్యశ్రీ అభినందించాడు.

తోటి రచయితల మెచ్చుకోలుకు వేడెక్కిన పాలలా పొంగిపోయాడు గోపి.

అంతలో—

రోడ్డు మీద ఏదో అల్లరి వినిపించింది.

ఒక కండలు తిరిగిన శరీరం ఒక బొక్కలు తేలిన శరీరాన్ని తంతూ వుంది.

రచయితలు గబుక్కున బయటకు చూచారు. జనమంతా చూస్తున్నారు ఎవరూ ఏమీ అనటం లేదు.

ఒక బలాఢ్యుడు బక్కవాణ్ణి తంతున్నాడు.

బక్కవాడు పెద్దగా అరుస్తున్నాడు "అవ్వ్రనా నేను చూశానురా నివ్వు ఆమెను డ్యాష్ కొట్టటం"—

"తగిలితే తగిలింది. తగిలించాలని తగిలించానా? నువ్వెవడివిరా అనటానికి" అంటూ తంతున్నాడు.

## వచ్చేవారం

- సూ్కళ్ళు తెరుస్తున్నారు... (విశేష రచన)— — అనుపమ
- ఇరుకు (కథ) — భైరవయ్య
- సరస్వతీదేవి శాపం (కథ) — తోలేటి జగన్మోహనరావు
- కారణం (కథ) — సుస్మితా రమణమూర్తి
- శుక్లా భస్మాసుర హస్తానికి బలైన 'కిస్సా కుర్సీకా' — సినీతంత్ర
- శ్రీ శ్రీ అనంతం • సావేరి • రాజు—పేద
- బాలతంత్ర • ఇంకా ఇతర ఆకర్షణలు...

రచయితలు మేడ దిగి అప్పటికి బయట కొచ్చి ద్వారం వద్ద నిల్చున్నారు.

"ఏమిటీ కథ" గోపి భార్య నడిగాడు.

"ఆయన రోడ్డు వెంట వెళ్తున్న ఒకామె బుజానికి కావాలని తగిలాడట. ఇదేమిటి మర్యాద అని ఈ బక్కాయన అన్నాడట అన్నందుకు తన్నులు"—

రచయితలకు అర్థమైంది. కాని వాడు బలాఢ్యుడు. ఎవరైనా అడ్డంపోతే తన్నేలా వున్నాడు.

బక్కవాడు కిందబడగానే బలవంతుడు వెళ్ళి పోయాడు.

బక్కవాడు లేచి నిల్చున్నాడు. జనమంతా "అయ్యో పాప"మన్నారు. బక్కవాడికి కోపమొచ్చింది. "నన్ను చూచి అయ్యో అంటున్నారా? నన్ను తంతున్నప్పుడు మీ నోళ్ళన్నీ ఎటు పొయ్యాయి? నేను వాణ్ణి అన్నది తప్పా? వాడు రౌడీ అని భయం కదూ మీకు ఛీ మీకు నోళ్ళు లేవు" అరుస్తు న్నాడు.

బక్కవానికి రచయితలు కనిపించారు.

"ఓహో మీరంతా రచయితలు కదూ! మహా రచయితలు మీరు కూడా నోళ్ళు మూసుకున్నారు, అవును మీ కలాలకు నోళ్ళుంటాయి తప్ప మీకు కాళ్ళు చేతులు, నోళ్ళు ఏవీ లేవు. వున్నా – ఆ చేతు లున్నాయి చూడు అవి చప్పట్లు కొట్టటానికే పనికొస్తాయి. నన్ను చూచి చప్పట్లు కొట్టండి! అసలు వాడి హీరో తనం చూచి చప్పట్లు కొట్టాల్సింది మీరు" అరుస్తూ వెళ్ళి పోయాడు బక్కవాడు.

రచయితల ముఖం మీద నల్ల సిరా చూచే వాళ్ళకు కనిపించసాగింది. ✽

## రచయితలకు...

వస్తువైవిధ్యం, జీవిత వాస్తవాల చిత్రీకరణ, శిల్ప చమత్కారం వున్న కథలు 'ప్రజాతంత్ర' కి పంపించండి. ప్రచురించబడిన ప్రతి కథకూ యాభై రూపాయలు పారితోషికం యిస్తున్నాం.

— ఎడిటర్